**ప్రగతి - వనిత వినియోగదారుల కథల పోటీలో నాల్గవ బహుమతి పొందిన కథ**

# ముందుచూపు

**డా॥ కోగంటి విజయలక్ష్మి**

"కాఫీ."

పొగలు కక్కే కాఫీ అందుకుంటూ భార్య వదనంలోకి చూశాడు రవి.

"ఏమిటి దేవిగారు ప్రసన్నంగా వున్నారు? అడక్కుండానే కాఫీ తెచ్చారు?" రజని నవ్వింది.

"అక్కడికి నేనేదో రోజూ పొట్ట కాల్తున్నా పెట్టనట్టు?"

"అని కాదనుకో. కానీ...."

"ఏదో పని ఉండబట్టి ఇలా చేశానంటావా?"

"ఆఁ. అవునవును. ఈరోజు షాపింగ్‌కి వెళ్ళాలన్నావుగా, గుర్తొచ్చిందిలే!"

రజని అలిగినట్టు ముఖం పెట్టి వెనక్కి తిరిగి వెళ్ళిపోయే ప్రయత్నంలో అడుగు ముందుకేసింది.

రవి హఠాత్తుగా రజని జడను దొరక పుచ్చుకున్నాడు. ఇటు తిరిగి ఏదో అనబోయి కిటికీ వంక చూసి ఆగిపోయింది.

ఏమై వుంటుందా అని రవి కూడా తల తిప్పి చూశాడు.

కిటికీలోంచి రోడ్డు మీద ఆగి ఉన్న లారీ కనబడింది. అందులోంచి కూలీలు ఏవో సామాన్లు దింపే ప్రయత్నంలో వున్నారు.

"లలితా వాళ్ళింటికి సామాన్ల లారీ ఏదో వచ్చింది" అంది రజని కుతూహలంగా.

"ఆవిడగారు మళ్ళీ ఏదో చౌకబేరం చేసుంటుందిలే."

"నీకన్నీ వేళాకోళాలే! లలిత చక్కగా ఇంట్లోకి కావల్సిన సామాన్లన్నీ సమకూర్చుకుంటుంది. భర్త తాగి ఇల్లు పట్టించుకోకపోయినా, పాపం ఆవిడ పొదుపు చేసుకుని, ట్యూషన్లు చెపూ సంసారం వెల్తి లేకుండా చూసుకుంటోంది. ఆవిడ్ని మెచ్చుకోవాలి నిజంగా!"

"నిజమేలే" ఒప్పేసుకున్నాడు రవి.

"ఇంతకీ లారీలో ఏమై వుంటుంది?" అంటూ కిటికీ దగ్గరకు వెళ్ళి చూసింది. అప్పుడే లారీలోంచి ఓ పెద్ద అట్టపెట్టెని నలుగురు మనుషులు కిందికి దింపి, జాగ్రత్తగా మోసుకుంటూ ఇంట్లోకి తీసుకెళ్ళారు.

"అది ఆమని ఎలక్ట్రానిక్స్ షాపు వాళ్ళ లారీ. వాళ్ళ దగ్గర కొన్న వస్తువుల్ని డోర్ డెలివరీ చేస్తారు. అంటే మీ లలిత ఏదో పెద్ద వస్తువే కొంది సుమా!" అన్నాడు రవి.

"అవును రవీ! నాతో మాటమాత్రమైనా అనలేదు. ఏమైవుంటుందబ్బా!"

"తర్వాత తీరిగ్గా ఆలోచిద్దువు గాని, షాపింగన్నావుగా. రెడీ అవు."

"ఆగు రవీ! షాపింగ్ తర్వాత. ముందు లలితా వాళ్ళింటికి వెళ్ళొస్తా!"

రజని గబగబ బయటకు నడిచింది.

సామాన్ల లారీ అటు వెళ్ళింది, రజని ఇటు గడప లోకి వెళ్ళింది.

"ఆంటీ వచ్చారు" అంటూ పెద్ద పాప లోపల వున్న వాళ్ళమ్మకి వినబడేట్లు అంది.

"రా... రజనీ" అంటూ కుర్చీ చూపింది లలిత.

"ఏమిటో హడావిడిలో ఉన్నట్టున్నారు?" అంది రజని.

"అబ్బే ఏం లేదు. ప్రొద్దున్న బజారుకెళ్ళి ఎయిర్ కూలర్ ఒకటి కొన్నాను. దాన్ని బెడ్‌రూంలో పెట్టిస్తున్నా. అంతే!"

వింటున్న రజనికి మతి పోయింది. ఎంతో పొదుపుగా సంసారం నడుపుకొచ్చే లలిత ఎయిర్‌కూలర్ కొనడమా?

"అలాగా సంతోషం!" అంది రజని పైకి.

"ఎండలు బాగా మండిపోతున్నాయా? ఈ ట్యూషన్లు చెప్పి చెప్పి అలసిపోయి పడుకుందామంటే నిద్ర పట్టదు. అందుకని ఓ కూలర్ కొనేశాను. రా చూద్దువు గాని" అంటూ బెడ్‌రూంలోకి తీసుకెళ్ళింది.

రూంలో ఓ మూలగా స్టాండ్‌కి ఫిక్స్ చేసిన ఓ అందమైన కూలర్ ఆ గదిని అలరిస్తోంది.

"మంచి పనేలే! ఎంతయిందేమిటి?" అంది రజని.

"నాలుగు వేలు అయింది అంతా కలిపి?"

"ఇన్‌స్టాల్‌మెంటా?" అంది ఇంక ఉండబట్టలేక.

"కాదు. రెడీ కేషే!" అంది లలిత మామూలుగా.

రజని ఉలిక్కిపడింది. 'అంత డబ్బు ఒక్కసారి ఎలా వచ్చిందబ్బా! అప్పుడప్పుడూ తన దగ్గర వందా రెండొందలు అప్పు తీసుకుంటుంది కదా!' లోలోన మథనపడసాగింది.

"నీదగ్గర దాచడమెందుకుగానీ, ఈమధ్య ఓ చిత్రం జరిగింది" అంటూ కూలర్ వేసింది.

చల్లనిగాలి ఒళ్లంతా చుట్టేసి ఆహ్లాదంగా ఉంది. అందులోనూ మే ఎండలేమో ఉడుకెత్తిపోయి ఉన్న శరీరం చల్లగాలి తగలగానే ప్రాణం లేచొచ్చినట్లనిపించింది.

"చిత్రం ఏమిటండోయ్!" అంది ఆసక్తిగా.

"పోయిన నెలలో ఉగాదికని ఓ వెయ్యి రూపాయలు పెట్టి పట్టుచీర కొనుక్కున్నాను కదా, నీకూ చూపెట్టాను."

"ఆ గ్రీన్ కలర్‌దా?"

"అవును. పండుగ రోజు ఆచీర కట్టుకుని పూజ చేసుకుందామని పీట మీద కూర్చున్నా. అంతే నిలువునా చిరిగిపోయింది. ఏడుపు వచ్చిందనుకో. పండుగ రోజు కొత్త చీర చిరిగిందంటే అశుభంగా అన్పించి ఆ రోజంతా మనసు వికలమై పోయింది."

"అవును. ఎవరికైనా అలాగే ఉంటుంది మరి" అంది రజని నొచ్చుకున్నట్టుగా.

"ఆ మర్నాడు చీర తీసుకెళ్ళి షాపువాడికి చూపించి, పాత స్టాకు ఇస్తారా అని దెబ్బలాడాను."

"ఊఁ?" అంది కుతూహలంగా రజని.

"షాపువాడు మీ అశ్రద్ధ వల్లే చీర చిరిగి వుంటుంది. మీరు కూర్చున్న పీట మీద మేకు వుందేమో, లేదా ఇంకే అశ్రద్ధ వల్ల చిరిగిందో మాకేం సంబంధం లేదు అంటూ దబాయించాడు. షాపులో అందరూ ఒకటై నన్ను పురుగులా దులపరించినట్లు మాట్లాడారనుకో. కళ్ళనీళ్ళు వచ్చాయి. తిరిగి వచ్చేశాను."

"ఊఁ!"

"బాగా ఆలోచించి ఓ వారం తరువాత కన్స్యూమర్ కోర్టుకెళ్ళి అక్కడ ఇదంతా చెప్పాను. వాళ్ళు ఓ పేపరిచ్చి అన్ని వివరాలూ రాసి ఇవ్వమన్నారు. ఓ పది రూపాయలు కట్టి ఫారం తీసుకుని నింపి, ఫిర్యాదు రాసి దాఖలు చేసి ఇంటికొచ్చాను. నెల రోజుల తరువాత కోర్టు నుంచి కాయితం వచ్చింది కోర్టుకు రమ్మని. అలాగే వెళ్ళాను. నేను ఇచ్చిన ఫిర్యాదును, చీరను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏం జరిగిందీ చెప్ప మన్నారు. అంతా పూస గుచ్చినట్లు చెప్పాను. అక్కడ షాపు ప్రొప్రయిటర్ కూడా హాజరయి వున్నాడు. అతను నా అశ్రద్ధ వల్లే చీర చిరిగిందని వాదించాడు.

కోర్టు వారు చీరను బాగా పరీక్షించి, అది మేకు పట్టి చిరిగిన చిరుగు కాదనీ, ఆ చీర ఒకసారి కంటే ఎక్కువ కట్టిన చీర కాదనీ, పాత స్టాకులో చీరనీ, చీర మడత బారులో పిగిలిందనీ నిర్ణయించి, షాపు అతనికి అయిదు వేలు జరిమానా కట్టమని, కొత్త చీర ఇంకోటి ఇవ్వమనీ తీర్పు ఇచ్చారు. ఆ డబ్బు మొన్ననే అందింది. ప్రస్తుతం కూలర్ అవసరం కదా అని కొన్నాను" అంది.

"ఒక్కరే కోర్టుకెళ్ళి కేసు పెట్టి గెలుచుకొచ్చారా?" అంది ఆశ్చర్యంగా రజని.

"అవును. ఇక్కడ మామూలు కోర్టుల్లాగా కేసులు, వాయిదాలు, ప్లీడర్లు, డబ్బు ఖర్చు వుండవుగా. చాలా సింపుల్ ప్రొసీజర్. ఆడవాళ్ళం తేలిగ్గా చేసుకోతగినదిగా వుంది."

"అవును. కన్స్యూమర్ కోర్టుల గురించీ, కేసుల గురించీ పేపర్లో చదువుతున్నాం అనుకో. కానీ, ఇది ఇంత తేలిగ్గా వుంటుంది అంటే ఆశ్చర్యంగా వుంది." లలిత నవ్వింది.

"మొత్తానికి ధైర్యస్థులే మీరు" అంది రజని.

"ఈ విషయంలో అధైర్యం అనేదానికి తావే లేదు. బజారుకెళ్ళి వస్తువులు కొని తెచ్చుకుంటాం కదా! అలాగే మోసపోయినప్పుడు ఆ వస్తువు గురించి న్యాయం చెయ్యమని ఫోరంకి వెళ్తాం అంతే!"

"అవునవును" అంది అర్థమయినట్లుగా రజని.

✧ ✧ ✧ ✧

"రజనీ నాకు టైం అవుతోంది. టిఫిన్ రెడీయేనా?"

"ఇదో వచ్చేస్తున్నా! మిక్సీలో పెసరపప్పు వేసి పది నిమిషాల నుంచీ తిప్పలు పడుతున్నా."

"ఏమైంది?"

"వెధవ మిక్సీ. కొని రెండు నెలలు కాలేదు రెండు సార్లు రిపేరు చేయించాను. మళ్ళీ ట్రబులిస్తోంది."

రవి దగ్గరకొచ్చి చూశాడు. మిక్సీ ఒక్క సెకను తిరిగి, ఆగిపోయి, కీచుమంటూ శబ్దాలు చేయడం మొదలుపెట్టింది.

"ఊ ఇక నేను టిఫిన్ తిన్నట్లేలే. బయట చేస్తా కానీ, కాఫీ ఇచ్చెయ్యి."

రజని గబగబా కాఫీ కలిపి తెచ్చి భర్తకి ఇచ్చింది.

"రవీ, ఒక పని చేస్తేనో? మిక్సీ కొని రెండు నెలలు కాలేదు. మూడుసార్లు షాపు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోతోంది. కన్స్యూమర్ కోర్టులో కేసు వేద్దాం!" అంది.

"ఇదిగో నావల్ల కాదు. మిక్సీ పుచ్చుకుని కోర్టు చుట్టూ తిరగమంటావా? చాల్లే ఇక ఆపు" రవి విసుక్కున్నట్టుగా వెళ్ళిపోయాడు.

రజని మనసు ఊరుకోలేదు. రెండు వేలు పోసి కొన్న మిక్సీ రెండు నెలలు కూడా పని చెయ్యకపోతే కన్స్యూమర్ కోర్టుకి వెళ్ళకపోవటం ఏమిటి? పక్కింటి లలిత ఎంత చక్కగా తెచ్చుకుంది. ఆ ఆలోచన రజనిని ఒకచోట నిలవనివ్వలేదు. రవికి చెప్పకుండానే ఆ పని తను చెయ్యాలి. ఆమాత్రం చెయ్యలేదేమిటి? లలిత కంటే తనేం తక్కువని! లలిత భర్త అసలేం పట్టించుకోడు. అన్నీ లలిత చూసుకోవటం లేదూ!


రజని గబగబ ఇంటి పనులన్నీ ముగించి స్నానం చేసి మిక్సీ పుచ్చుకుని బయలుదేరింది. అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళి కోర్టు ముందు ఆటో ఆపించి దిగింది. లోపలికి వెళ్ళి తను వచ్చిన పని చెప్పింది. పది రూపాయలు కట్టి ఫారం తీసుకుంది. రజనిలో ఏదో తెలీని ఆనందం! తను మిక్సీ కంపెనీ వాళ్ళకి బుద్ధి చెప్పబోతోంది. తనూ కేసు గెలిచాక మంచి కూలర్ కొనుక్కోవాలి లలితలాగే! ఫారం పూర్తి చేసి ఫిర్యాదు రాసి ఇచ్చింది.

అది తీసుకుని క్షుణ్ణంగా చదివి తలూపాడా వ్యక్తి. "మిక్సీ కొన్న బిల్లు, గ్యారంటీ కార్డు ఈ ఫారంకి జత చేయాలి. ఆ తరువాత మీకు కోర్టు నుంచి పిలుపొస్తుంది."

"బిల్లు తేలేదండీ! మిక్సీ తెచ్చానుగా!" అంది.

"డబ్బు చెల్లించిన రసీదు లేకపోతే పని జరగదు. ఫిర్యాదుతో పాటు, బిల్లు కూడా వుండి తీరాలి." గ్యారంటీ కార్డు, వస్తువు - అన్నీ సబ్మిట్ చేయాలి. రజనికి గుండె ఆగి పోయింది. ఆ బిల్లు ఎక్కడ పెట్టిందో గుర్తు లేదు.

"సరే, ఇంటి దగ్గర వెతికి తెస్తాను." అని బయలుదేరింది.


Vemakoti Seeta Rama Sastry
WRITER APSLB JAO (Field)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.

ఇంటికొచ్చి బీరువా, పుస్తకాలు అంతా తిరగేసింది. ఎక్కడా మిక్సీ కొన్న బిల్లు జాడ లేదు. అసలా బిల్లు అప్పుడే ఎక్కడో పడేసి ఉంటుంది. 'బిల్లు లేకపోతే మాత్రమేం? చెడిన మిక్సీ కనబడుతోందిగా' అనుకుంది కసిగా.

అయినా లలితతో చెప్పి చూద్దాం అనుకుంటూ పక్కింటి కెళ్ళింది.

"నువ్వు బిల్లూ అదీ జాగ్రత్తగా కోర్టులో ఇచ్చావా?" అడిగింది. తల అడ్డంగా వూపింది రజని.

లలిత నవ్వింది. లోపలికెళ్ళి రెండు ఫైల్స్ తెచ్చి రజని చేతికిచ్చింది. రజని అందుకుని తిప్పి చూసింది. అది బిల్లుల ఫైలు. ఒక్కోటి తిప్పి చూసింది. పళ్ళపొడి, పౌడరు డబ్బా, తలనూనె దగ్గర్నుంచీ మొన్న కొన్న కూలర్ వరకు బిల్లులన్నీ చక్కగా మడత నలగకుండా ఫైలు చేసి వుంచింది. రెండో ఫైలు తీసింది. అందులో వస్తువు కొన్న తాలూకు గ్యారంటీ కార్డులు!

"రజనీ! మనం ఫిర్యాదు చేస్తున్నామంటే - దాని తాలూకు వివరాలన్నీ పూర్తిగా ఇవ్వగలగాలి. అవి లేకపోతే కోర్టు మాత్రం ఏం చేస్తుంది? ముఖ్యంగా షాపులో డబ్బు చెల్లించగానే వాళ్ళ దగ్గర రసీదు అడిగి తీసుకోవటం, దాన్ని వస్తువంత జాగ్రత్తగానూ ఇంటికి తెచ్చి ఒక చోట గుర్తుగా దాచుకోవటం చెయ్యాలి. మనం ఒక వస్తువు ఆ షాపులో కొన్నందుకు రుజువు బిల్లే! అది లేకపోతే ఎవరూ ఏమీ చెయ్యలేరు."

"అసలు బిల్లుల అవసరం ఇంత వుంటుందని నాకు తెలీదు. ఎప్పుడూ షాపు నుంచి బయటకు రాగానే, ఆ బిల్లు పేపర్ని పక్కనే పడేస్తాను. అదొక పెద్ద చెత్తలాగా అనిపిస్తుంది నాకు" అంది రజని అమాయకంగా.

"ఇకనైనా బిల్స్ జాగ్రత్తపరచటం అలవాటు చేసుకో" అంది లలిత. రజని వదనం చిన్నబోయింది.

తన అశ్రద్ధ వల్ల కలిగిన నష్టాన్ని తలచుకుంటూ ఇంటి ముఖం పట్టింది. ❑